కీసరలో వైభవంగా శ్రావణమాస పూజలు

- స్వామివారికి క్షీరాభిషేకం.. పల్లకీసేవ



స్వామి వారి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం శ్రావణమాసోత్సవ ప్రత్యేకపూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షీరాభిషేకం పూజలను అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శ్రావణమాసం అందులో శివుడికి ఇష్టమైన రోజు సోమవారం కావడంతో స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాలనుండి భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. స్వామి దర్శనానంతరం ప్రధాన ఆలయం ఎదురుగా ఉన్న శివలింగాలకు పసుపు, కుంకుమ, పాలు, పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసరను మున్సిపాలిటీగా చేయాలి



కీసరగుట్టలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

కీసర: ఓఆర్‌ఆర్‌కు వెలుపల ఉన్న కీసర, భోగారం, అంకిరెడ్డిపల్లి, కీసర దాయర, రాంపల్లి దాయర గ్రామాలను కలిపి కీసర మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని అఖిల పక్షం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కీసరగుట్ట జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద అఖిల పక్ష నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామిడి ప్రభాకర్ రెడ్డి, నాయకపు వెంకటేష్, రాగుల అశోక్, సింగారం నారాయణ తదితరులు సమావేశమయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీసర మండలంలో తెలంగాణలో ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట దేవాలయం ఉందని ఇక్కడి ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, గత ప్రభుత్వం కీసరగుట్టను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కీసర గుట్ట ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేతలు పండుగ శశికాంత్, నాగరాజు,సింగారం నారాయణ, మహేష్, గన్నోర్ల సత్యనారాయణ, కొలిచెలిమి కృష్ణ, నల్ల వెంకట్‌రెడ్డి, జగన్, నాగరాజు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా నాగమణి



కమిషనర్ నాగమణికి శుభాకాంక్షలు చెబుతున్న చైర్‌పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఎ.నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొత్త కమిషనర్ నాగమణిని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీహరిగౌడ్, కొత్త హేమలత, వెంకటేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్పస్వామి బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పోచారం: యంనంపేట్‌లోని బీరప్ప స్వామి ఆలయంలో సోమవారం బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నర్రి ధనలక్ష్మి కాశయ్య, పెద్ద కురుమ వాడి శంకర్, షల్ప్రాజి, మాజీ ఎంపీటీసీ నర్రి శ్రీశైలం, నర్రి శంకర్, కురుమ సంఘ సభ్యులు అడ్వకేట్ రేగు మల్లేష్, శివలింగం, సందీప్, బాలరాజ్, కాశయ్య, గణేష్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం జిల్లా చైర్‌పర్సన్‌గా హసీనా



నియామకపత్రాన్ని అందజేస్తున్న సక్కు దానియేల్

పోచారం: జాతీయ మానవ హక్కుల సామాజిక న్యాయ సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా నారపల్లికి చెందిన షేక్ హసీనా నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు సక్కు దానియేల్ సోమవారం ఆమెకు అందజేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేణు మాధవ్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు శీలం సరస్వతి, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇబ్రహీం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జితేందర్ సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

వాడవాడలా శ్రమదానాలు, ర్యాలీలు

- పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు
- కార్యక్రమ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం మేడ్చల్ నియోజకవర్గంలో పట్టణాలు, గ్రామాలలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వార్డుల వారీగా విద్యార్థుల చేత ర్యాలీలు నిర్వహించి అధికారులు, చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేశారు. గ్రామాలలో ప్రత్యేకాధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

→ మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలో జవహర్‌నగర్ కార్పొరేషన్, మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి, ఘట్‌కేసర్, కీసర మండలాల్లోని గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు.

→ తూంకుంట మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బ్యాండ్ వాయిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి జాన్ శ్యాంసన్ పాల్గొన్నారు. జవహర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో బహిష్కరణ



ఉన్నతాధికారులను నిలదీస్తున్న అంకుషాపూర్‌వాసులు

ఘట్‌కేసర్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అంకుషాపూర్ గ్రామంలో స్థానికులు బహిష్కరించారు. డీఆర్‌డీఏ సాంబశివరావు, డీపీఓ వెంకన్న ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం ప్రాంభించాల్సి ఉండగా ప్రజలు అడ్డుకున్నారు. అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం గ్రామాలను బీబీనగర్ మండలంలో విలీనం చేస్తారని వస్తున్న పుకార్లపై స్పష్టత ఇవ్వాలని అధికారులను నిలదీశారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో ఉన్న మమ్మల్ని మేడ్చల్ జిల్లాలో కలిపారని, ప్రస్తుతం యాదాద్రి జిల్లాలో కలుపడం సమంజసం కాదన్నారు. ప్రజలతో చర్చించకుండా అధికారులు నిరంకుశంగా నిర్ణయం తీసుకున్నారని, వెనక్కు తీసుకునేంత వరకు వదిలేది లేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోకూడదని ఉన్నతాధికారులు నచ్చచెప్పినా స్థానికులు వినలేదు. అనంతరం మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణాకర్, మత్స్యేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. డీపీఓ వెంకన్న, డీఎల్పీఓ సాంబిరెడ్డి, ఎంపీడీఓ గీతారెడ్డి, తహసీల్దార్ రజని, ఎంపీఓ రవి, మహేశ్ ముదిరాజ్, రాజుముదిరాజ్, జగన్, ఆంజనేయులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

→ ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్‌లు దీపికానర్సింహారెడ్డి, లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, చంద్రారెడ్డి, పావనీ జంగయ్య, ప్రణతి శ్రీకాంత్‌గౌడ్, మేయర్ శాంతి కోటేష్‌గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ర్యాలీ



నాగారం మున్సిపాలిటీలో చైర్మన్ చంద్రారెడ్డి



దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్



నారపల్లిలో జిల్లా ప్రత్యేక అధికారి జాన్‌శ్యాంసన్



తూంకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మేడ్చల్‌లో చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి...



గుండ్లపోచంపల్లిలో...



జవహర్‌నగర్‌లో మేయర్ తదితరులు

'ప్రజావాణి' సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారాన్ని చూపాలని సంబంధిత అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. స్టేట్ లెవెల్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడివుటే అలాంటి దరఖాస్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ అర్జీదారుల జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అందజేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సైదులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 108 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

వేడుకగా ధ్వజారోహణం



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ గోదాదేవి సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సుప్రభాత సేవ, నిత్యవిధి, బేరీపూజ, దేవత ఆహ్వానం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కొబ్బరి కాయలు, పూలు సమర్పించి ధ్వజారోహణ చేశారు. పూజల్లో ఆయలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

'పూడూర్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దు'



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

మేడ్చల్: మండలంలోని పూడూర్ గ్రామాన్ని హైదరాబాద్ మహనగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం చేయవద్దని గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అలాగే మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పోచయ్య, ప్రవంతి వెంకటేష్, సుగుణమ్మ, రఘు, నాయకులు సంజీవరెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడు గ్రామాలను యాదాద్రిలో కలుపొద్దని వినతి

ఘట్‌కేసర్: అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలుపొద్దని కోరుతూ జేఏసీ నాయకులు సోమవారం వినతి అందజేశారు. ఓఆర్‌ఆర్ బయట ఉన్న ఆరు గ్రామాలను మండలంగా ఉంచాలని, లేదంటే మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలన్నారు. అదీకాదంటే ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కలపాలని అఖిల పక్ష నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్, అదనపు కలెక్టర్ శ్యాంసన్‌కు వినతి పత్రాలను సమర్పించారు. నాయకులు కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శోభారాణి, ఐలయ్యయాదవ్, గోపాల్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, మాధవరెడ్డి, వామన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, కష్టగౌడ్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం

కుషాయిగూడ: మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్ల దృష్ట్యా నిత్య యోగ సాధన, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని డాక్టర్ ఎంపల్లి సృజన పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్, శివసాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 'యోగా అండ్ యూ' యోగ శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడే కాకుండా మన ఆరోగ్యంపై దృష్టి సారిస్తే రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. దీనికి యోగాతో పాటు వ్యాయామం చేయడమే చక్కటి మార్గమన్నారు. శిక్షణ కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. యోగ గురువు, రామ్‌శెట్టి, కాలనీ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

గౌతంనగర్: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ గౌతంనగర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడలోని చిన్మయ్ మార్గ్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. నాయకులు పీవీ. సత్యనారాయణ, ఫరీద్, వెంకట్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లు బ్యాంకులో జమ చేయాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు సీనియర్ సిటిజన్లు తమ పెన్షన్లు బ్యాంకు అకౌంట్, పోస్టాఫీస్ ఖాతాలో జమ చేయాలని కోరుతూ.. మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసరా పెన్షన్ల కోసం రోజంతా క్యూలో నిలబడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వయోభారం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగా బ్యాంక్ అకౌంట్‌లో వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. సామాజిక కార్యకర్త డాక్టర్ లక్ష్మి వీరమల్లు, సీనియర్ సిటిజన్లు సోమయ్య, కృష్ణ, ప్రసాద్, నర్సింగ్‌రావు, దశరథం, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు

అల్వాల్: క్రిమ్సన్ ఇంటర్ స్కూల్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ సీజన్-1 పోటీలు అల్వాల్‌లోని సెయింట్ మైకెల్స్ స్కూల్‌లో ఘనంగా జరిగాయి. తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో నగరంలోని 17 పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి గేమ్ నాకౌట్-విజేతలు రౌండ్-1 నుంచి క్వార్టర్ ఫైనల్స్, సెమీస్‌తో పాటు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మూడు రోజుల పాటు మొత్తం 19 మ్యాచ్‌లు జరిగాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడల్లో అనేక అంతర్జాతీయ టోర్నమెంట్‌లో మనదేశానికి ప్రాతినిధ్యం వహించిన భారత జాతీయ బాస్కెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, సెయింట్ మైకెల్స్ పాఠశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ జాతీయ జట్టు మాజీ కెప్టెన్ నాథస్ అబ్రహం, భారత సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు మాజీ ప్రధాన కోచ్, తమిళనాడు సీనియర్ పురుషుల జట్టు, యంజీ యూనివర్సిటీ మహిళల జట్టు ప్రస్తుత ప్రధాన కోచ్ సీవీ. సన్నీ తదితరులు టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ చాంపియన్‌షిప్‌లో డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ చాంపియన్స్‌గా నిలవగా.. ఆర్మీ పబ్లిక్ స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో విజేత జట్టు చాంపియన్‌షిప్ ట్రోఫీ, పతకాలను అందుకుంది. క్రిమ్సన్ ఎడ్యుకేషన్ సీఈఓ హుసియన్ దోహద్వాల్లా తదితరులున్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల టోకరా

పోచారం: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి డబ్బు కాజేసిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు సమాచారం మేరకు... జోడిమెట్లలోని అరుంధతి కాలనీకి చెందిన ధారావత్ వెంకటరామ్(52) ఆర్టీసీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి గత నెల 31న ఇండస్ ఇండ్ క్రెడిట్ కార్డు డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నట్లు ఓ వ్యక్తి ఫోన్ చేసి కార్డ్ ప్రొటెక్షన్ ఇన్సూరెన్స్ తీసుకున్నారా అని అడిగాడు. లేదని సమాధానమిచ్చి ఇన్సూరెన్స్‌ను డీయాక్టివేట్ చేయమన్నాడు. ఇందుకు ఓ లింక్‌ను వెంకటరామ్ ఫోన్‌కు పంపాడు. ఆ లింక్ పైన క్లిక్ చేయగా ఓటీపీ వచ్చింది. దాన్ని ఎంటర్ చేయగానే క్రెడిట్ కార్డు నుండి రూ. 1,47,395.40 డబ్బు డ్రా అవడంతో మోసపోయానని గ్రహించి, సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం



ఉమారాణి

ఘట్‌కేసర్: యువతి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి సమాచారం మేరకు... పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మంతపూర్ ఉమారాణి(19) కొంత కాలంగా స్థానికి కృష్ణ వస్త్ర దుకాణంలో పని చేస్తుంది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరు భోజనం ముగించుకొని నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి ఉమారాణి కనిపించలేదు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

భక్తుల సహకారంతోనే ఆలయ పునర్నిర్మాణం

మౌలాలి: భరత్‌నగర్‌లో మహంకాళి దేవాలయ అభివృద్ధి, ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావడం ప్రతి హిందువు కర్తవ్యమని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. గత మూడేళ్లుగా మౌలాలి డివిజన్‌లోని పలు ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. భరత్‌నగర్ ఆలయ పునర్నిర్మాణంలో తనవంతు పాత్ర ఉండటం తమ పూర్వ జన్మ సుకృతమని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఆలయాభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్న సందర్భంగా గణపతి పూజతో ప్రతిష్ఠాపన మొదలైందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేష్‌యాదవ్, దుర్గేష్, సుధాకర్, మహేందర్, మహిళలు పాల్గొన్నారు.

సొంత ఇంటిపై చిగురిస్తున్న ఆశలు?

స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి రూ. 5 లక్షల సాయం

- జిల్లాలో మొత్తంగా 17,500 మందికి అవకాశం
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- 'ప్రజాపాలన'లో వచ్చిన దరఖాస్తులు 1.10 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: సొంత ఇంటిపై పేద ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. స్థలం ఉండి ఇప్పటి వరకు ఇల్లు నిర్మించుకోలేని వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చాక దరఖాస్తులను స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపిక చేసి ఇళ్ల మంజూరు చేస్తామని కూడా ప్రకటించింది. గడచిన ఏడు నెలలుగా దానిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా లేకపోయినా ఇటీవల ప్రభుత్వం బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్లకు నిధులు కేటాయించటంతో దరఖాస్తుదారుల్లో సొంత ఇంటిపై ఆశలు చిగురించాయి. జిల్లాలో ఇళ్ల లేని వారి సంఖ్య వేలల్లోనే ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను పక్కనబెట్టేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది.

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 5 నియోజకవర్గాల పరిధిలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్ల మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పథకం కింద ఒక్కో గృహం నిర్మాణానికి రూ. 5 లక్షలు లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. జిల్లాకు మొత్తం కలిపి 17,500 ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. వీటి నిర్మాణానికి లబ్ధిదారులకు నిర్మాణ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయానికి రూ. కోట్లల్లో నిధులు అవసరం. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 1,10,226 దరఖాస్తులు రాగా, ఇంటి స్థలాలు లేని వారి నుంచి కూడా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. వీరిలో అర్హులను ఎంపిక చేయటం అధికారుల ముందున్న ప్రధాన సమస్య కానుంది.



- ఇందిరమ్మ ఇంటి నిర్మాణం అంటే మొదట గుర్తొచ్చేది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎవరి చేతుల్లో ఉంటుందనేది. గత ప్రభుత్వం దీన్ని కలెక్టర్ల చేతిలో పెట్టగా, ఈ ప్రభుత్వం మాత్రం ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా పట్టణాలు, గ్రామాల్లో నేతలు వారికి అనుకూలంగా ఉన్న వారికి ఇప్పించుకోవటానికి ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన లబ్ధిదారులు స్థానిక నేతలను ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది.